# మొక్కుబడి

**స్వామివారికి మొక్కుబడి చెల్లించడంలోనూ వెసులుబాటు ఉందని ఆమె నమ్మకం. ఆ భక్తురాలి అమాయకత్వం వెనుక దాగిన మూర్ఖత్వాన్ని, గడుసుతనాన్ని సైతం ఈ కథ తెలియజెప్తుంది.**

ఇంకే ఊళ్లోనూ తనక్కావలసిన సౌకర్యాలు లేవన్నట్లుగా వెళ్లి తిరుపతి కొండ మీదనే పీఠం వేసుక్కూచున్న వెంకటేశ్వరస్వామివారికీ, పద్మావతమ్మకూ మధ్య ఉన్నది కేవలం వైరభక్తే అని చెప్పక తప్పదు. ఒక్కోమారు అత్యవసరమైన భక్తీ, మరుక్షణంలో ఇతడితో తాను కాబట్టి వేగుతున్నదనుకుంటూ ధుమధుమలూ.

అయితే, ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి.

ఈ వైరభక్తికి గురి అవుతున్న వెంకటేశ్వరస్వామి తిరుపతి దేవుడే కానీ, ఈ పద్మావతమ్మ మాత్రం ఆయన దేవేరి కాదు; ఆ దేవేరి పేరు పెట్టుకున్న ఓ మానవమాత్రురాలు. నెల్లూరు జిల్లా గూడూరు తాలూకాలోని చింతవరం గ్రామ వాస్తవ్యురాలు. ప్రతి సారీ స్వామివారితో చేసుకున్న అగ్రిమెంటు ప్రకారం మొక్కుబళ్ళు చెల్లించాలనుకున్నప్పుడల్లా తిరుపతికే పోవడం, అక్కడ స్వామి వారితోపాటు పీఠం వేసుక్కూచున్న విశ్వనాథ్ ఇంట్లో దిగడం లాంటి ఇక్కట్లు తప్పనందుకు కోపంగా ఉన్న ఓ భక్తురాలు.

సదరు దేవుడు పూర్తిగా ఆంధ్రుడున్నూ పైగా ఆంధ్రుల ఇష్టదైవమున్నూ కాబట్టి, ఆయన్ను తిరుపతి నుంచి పోయి ఇతర రాష్ట్రాల్లో ఉండమని చెప్పడం లేదు పద్మావతమ్మ. (ఆయన వల్ల మనకు వచ్చే డబ్బు, దర్శా ఇతర రాష్ట్రాలకు దక్కనీలెమ్మనుకునేటంతగా ఆమెలో "ఆంధ్రుల ఆత్మగౌరవం" నశించలేదు.) కానీ, మన రాష్ట్రంలోనే ఫస్ట్ క్లాసైన హైదరాబాద్ లేదా? కృష్ణా నది ఒడ్డున విజయవాడ లేదా? చల్లని విశాఖపట్నం లేదా? ఇవన్నీ కాదని ఆయన తిరుపతి వెళ్లి కూచోవడం చూస్తుంటే, ఈ దేవుళ్లకు కొన్ని మహిమలున్నా ప్రపంచ జ్ఞానం తక్కువనిపిస్తుంటుందామెకు. అది చాలనట్లు, అక్కడెక్కడో సిమ్లాలో ఉద్యోగం చేస్తున్న విశ్వనాథ్‌ను తీసుకొచ్చి తన దేవస్థానం కొలువులోనే ఆఫీసరుగా ఉంచుకోవడం దేనికి? పైగా ఆ దేవస్థానానికి ఏవేవో కొనడానికంటూ అతణ్ణి విదేశాలక్కూడా పంపి, అహం తలకెక్కేటట్లు చెయ్యడం దేనికి?

ఈ కారణాల్ని బట్టి చూస్తే, ఆమె ఆ స్వామిని ఏనాడో బాయ్‌కాట్ చేసేసి ఉండవలసింది. కానీ, ఎప్పటికప్పుడు ఆయనతో లావాదేవీలు తప్పడంలేదు. బల్లవేలు దగ్గరున్న మంగమ్మత్తయ్య ఆస్తి అంతా వారసులకు పోకుండా కొంత తనక్కూడా రావాలనుకున్నా సీతయ్యా వాళ్ల చేలల్లో ఫలసాయం తమ మెట్ట పొలాల్లో కన్నా కాస్త వెన కదుగునే ఉండాలనుకున్నా తన ఇంట్లో పిల్లా, పెద్దా కలిసి బోరింగ్ కొట్టలేక చస్తుంటే తన మీద పోటీగా ఎదురింటి తులశమ్మ బంగారు గాజులు కుదవపెట్టి వేయించుకున్న కరెంటు బోరింగ్ పనిచెయ్యకుండా పోవాలనుకున్నా - అలాంటి సందర్భాల్లో మొక్కుకోవడం తప్పుతుందా? మొక్కుకున్నాక తిరుపతికి వెళ్ళి విశ్వనాథ్ ఇంట్లో దిగడం, దిగాక వాళ్ల నడమంత్రపు దర్జాల్ని గమనించడం తప్పుతుందా?

విశ్వనాథ్ తండ్రి పద్మావతమ్మకు మేనమామ. తానే దానకర్ణుడిననుకుంటూ అయినవాళ్ళకూ, కాని వాళ్ళకూ అన్ని వేళలా సంతర్పణలు చేసి అత్తగారిచ్చిన ఆస్తినంతా హారతికర్పూరంలా ఆర్పేసి, కొడుకు చదువుక్కూడా కష్టం తెచ్చిన ఘనుడు. ఆర్పేసుకోడానికి అందరికీ ప్రతాపం ఉంటుంది కానీ, తిరిగి అమర్చుకోవడం అందరికీ సులువు కాదుగదా? అదంతా తన తండ్రికే చెల్లింది. అంతా పోగొట్టుకున్నాక విశ్వనాథ్‌కి కాలేజీ ఫీజుక్కూడా గతిలేక వాళ్లు విలవిల్లాడుతోంటే, తన తండ్రి జాలి తలచి ఎన్నిసార్లు అప్పివ్వలేదు? వడ్డీ తీసుకున్నాడే అనుకో- అయినా, అంత సులభంగా అప్పిచ్చేవాళ్ళెవరీ రోజుల్లో?


ఆమె ఇలా ఆలోచిస్తున్నంతలో, ఆమె భర్త కాంతయ్య పొలం నుంచి వచ్చాడు. వస్తూనే, వాకిట బోరింగ్ కొట్టి కాళ్ళు కడుక్కుని తువాలుతో తుడుచుకుంటూ, "అన్నం వడ్డిస్తావా?" అన్నాడు.

అతడలా అడగడంతో, ఆ రోజు పద్మావతమ్మకు కోపం తెప్పించిన వారి సంఖ్య - తిరుపతి దేవుడితో, విశ్వనాథ్‌తో కలిసి - మూడయింది.

"ఏం? వడ్డిస్తే భోంచేసి కారులో వెళ్ళాలా? విమానంలో వెళ్ళాలా? వెళ్ళేది ఆ జానెడు పొలానికే గదా?" అందామె.


వాతావరణంలో అలా తుపాను వచ్చే సూచనలున్నప్పుడు, శరణాగతి తప్ప మరే మంత్రమూ పారదన్నది ఇన్నేళ్ళ వైవాహిక జీవితంలో గట్టిగా ఏర్పరచుకున్న అభిప్రాయం. అందుచేత అతడు తన మొహంలోంచి రకరకాల చిరునవ్వుల్ని ఆమె మీదికి ఫోకస్ చేస్తూ, "అబ్బెబ్బె, నాకేం తొందర? ముందు నీ తిరుపతి ప్రయాణం

చిత్రాలు: పి.ఎస్. బాబు



ఎందుకు చెబుతున్నానంటే, ఒక్కోసారి దాని నవ్వులు చూస్తుంటే ఒంటిమీద వంచె నిలవదు మీకు.

**దా**రి పొడుగునా కూల్ డ్రింకుల్తో, ఐస్ క్రీముల్తో, పనస తొనల్తో ఉక్కిరిబిక్కిరి చేసేసింది.



ఏర్పాట్లన్నీ చూసుకున్నావా? నన్ను కూడా తోడు రమ్మంటావా?'' అన్నాడు.

అయితే, ఇప్పటి పరిస్థితిలో అతడి వ్యూహం ఫలించడానికి బదులు కొంచెం బెడిసికొట్టింది.

"నాకు మీ తోడేమీ వెలగబెట్టనక్కర్లేదుగానీ, ఇంటి దగ్గర జాగ్రత్తగా నిర్వాకం చెయ్యండి చాలు. నేను ఇంట్లో లేను గదా అని రోజూ సాయంత్రమయ్యేసరికి పంచాయతీ బోర్డు వాళ్ల టీ.వీ. దగ్గర చెక్కర్లు కొట్టకుండా, ఇంట్లో గేదెల మేత సంగతి చూడండి. పాలు పిండే వాణ్ణి రోజూ పొద్దున్న నాలుగ్గంటలకే లేపండి. లేవకుంటే వాడి మొహం మీద చన్నీళ్లు పొయ్యండి. వినబడుతోందా?''

"స్పష్టంగా.''

"హాస్యం అఘోరించినట్లే ఉంది. ఈ మూడ్రోజులూ నేనూ, పిల్లలూ ఇంట్లో ఉండం కాబట్టి, మా వంతు లీటరు పాలు కూడా డిపోకి పోసెయ్యండి. మీ వాడుక్కు ఓ పావు చాలు.''

"చాల్పాలు.''

"నేనింట్లో లేకుండడం చూసి ఆ సావిత్రమ్మ ఒళ్లంతా ఊగిస్తూ, అన్నయ్యా, రెండు కరేపాకు రెమ్మలున్నాయా? అంటూ వస్తుంది. ఇచ్చారో, జాగర్త. ఎందుకు చెబుతున్నానంటే, ఒక్కోసారి దాని నవ్వులు చూస్తుంటే ఒంటిమీద పంచె నిలవదు మీకు.''

భర్తకలా ఆదేశాలిచ్చి, భోజనం పెట్టి, పొలానికి పంపించాక పద్మావతమ్మ తన తిరుపతి యాత్ర ఈ మారు విశ్వనాథ్ బోడి దర్జాలకు సవాలుగా ఉండాలంటే ఏం చెయ్యాలో ఆలోచించసాగింది.

ఎందుకంటే, దారిన పొయ్యే దానయ్యల్లాగా చేసి వచ్చెయ్యడానికిదేం మామూలు యాత్ర కాదు.

అమధ్య ఆమె ఓ అత్యవసర పరిస్థితిలో స్వామికి వెయ్యిన్నూటపదహార్లు సమర్పిస్తానని మొక్కుకుంది. కానీ, తీరా అనుకున్న పని నెరవేరాక, అదేమంత కష్టసాధ్యమైన పని కాదనీ, అంత చిన్నపనికి వెయ్యిన్నూటపదహార్లు కమిట్ కావడం పొరపాటనీ అనిపించి పశ్చాత్తాపంతో ఓ వారం రోజుల పాటు ఆమెకు అన్నహితవు పోయింది. అయినా, స్వామి యందు గట్టి విశ్వాసంగల పాత కాలపు భక్తురాలు కాబట్టి, ఏ రోజైనా రాత్రి నిద్రలో స్వామి తనకు స్వప్న దర్శనమిచ్చి, "అంత పెద్ద మొత్తాన్ని ఎందుకు వేస్టు చేస్తావే సత్యకాలప్పిల్లా! భక్తితో ఇచ్చిన తులసిదళం కన్నా నేను డబ్బుకు విలువ ఇవ్వను. నా మాట విని అయిదో, పదో పట్టుకెళ్ళి హుండీలో వేసెయ్యి'' అని ఉపదేశం చేస్తాడన్న ఆశతో కొన్ని రోజులపాటు పగలూ, రాత్రీ అదే పనిగా నిద్రావస్థలోనే ఉండిపోయింది కానీ, ఆ స్వామి మాత్రం మిగతా విషయాల్లో ఎంత భక్తవత్సలుడైనప్పటికీ, డబ్బు విషయాల్లో మాత్రం ఆమెకన్నా గట్టివాడవడం వల్లనేమో, గప్‌చిప్‌గా మొహం తప్పించి తిరుగుతూ, ఆమె నిద్రించే సమయాల్లో చింతవరం గ్రామ పొలిమేరల్లోకైనా రాకుండా ఉండిపోయాడు.

కానీ, అలా గప్‌చిప్‌గా ఉండిపోయినంత మాత్రానే ఈ భక్తురాలు వేరు దారి లేదన్నట్లుగా వెయ్యిన్నూటపదహార్లు తెచ్చి హుండీలో దాఖలు చేస్తుందని ఆ స్వామి భ్రమపడితే మాత్రం ఆయనకు నిజంగా ప్రపంచజ్ఞానం లేనట్లే అర్థం. ఇలాంటి ధర్మసూక్ష్మాల్ని ఇట్టే విడగొట్టగల పద్మావతమ్మ కాస్త దివ్య దృష్టితో ఆలోచించేసరికి, తాను స్వామివారికి మొక్కుబడిని చెల్లించే పవిత్ర కార్యక్రమానికంతా కలిపి వెయ్యిన్నూటపదహార్లు ఖర్చు చేస్తానని అనుకున్నట్లుగా గ్రహించింది. అంటే, డబ్బు ఖర్చయినా, ఈ మారు తను ప్రత్యర్థులందరినీ డొక్క చించి డోలు వాయించేటంత దర్జాగా యాత్ర చెయ్యవచ్చునని వివరణ ఇచ్చుకుంది.

దాంతో ప్రతిసారీ యాత్రలకు తన పిల్లల్లో ఒక్కరంటే ఒక్కర్ని తప్ప మరెవ్వరినీ గింజుకున్నా వెంట రానివ్వని పద్మావతమ్మ, ఈ మారు పిల్లలిద్దరితో పాటు పరివారాన్ని (అంటే పనిమనిషి పుల్లమ్మను కూడా) బయల్దేరదీసింది. మామూలుగానైతే డొక్కు బస్సుల్లో ఎక్కి కూచుని తను సన్నగా, పొట్టిగా ఉంది కాబట్టి అర టికెట్టే తీసుకుంటాననంటూ ప్రభుత్వ బస్సు కండక్టర్లతో ద్వంద్వ యుద్ధం చేసే మనిషి, ఈ మారు అందరికీ సూపర్ డీలక్స్ బస్సులో కండక్టర్ అడిగినంత డబ్బూ ఇచ్చి ఫుల్ టికెట్లు తీసింది.

**తి**రుపతిలో దిగాక, ఈ మారు విశ్వనాథ్ ఇంట్లో దిగకుండా ఏదైనా పెద్ద హోటల్లో రూము తీసుకోవాలనిపించిందామెకు. కానీ, ఇప్పటిదాకా ప్రతిసారీ తను తిరుపతికి వచ్చినప్పుడల్లా విశ్వనాథ్ దంపతులు ఇష్టం ఉండో, లేకో సకల మర్యాదలు చెయ్యడం, కొండ ప్రయాణానికి ఏర్పాట్లు చెయ్యడం, తిరిగి ప్రయాణమయ్యేటప్పుడు ఏదో ఒక విలువైన వస్తువు తెచ్చి తన సంచీలో కుక్కడం లాంటివి చేస్తున్నారు. అందుచేత ఇప్పుడు తను హోటల్లో దిగిందని విశ్వనాథ్‌కు ఆచూకీ తెలిస్తే, ఇంకో మారెప్పుడైనా మళ్ళీ వాళ్ళింట్లో దిగడానికి ఎబ్బెట్టుగా ఉంటుందనిపించి, మనసు మార్చుకుని ఆటో రిక్షాలో వెళ్లి సపరివారంగా వాళ్లింట్లో దిగింది.

నౌకరు కుర్రాడు వాళ్ల సామాన్లన్నీ లోపల పెట్టడం, తర్వాత కుశల ప్రశ్నలు, కాఫీలు అయ్యాక విశ్వనాథ్ ఆఫీసుకు వెళుతూ, "టౌన్లో గుళ్లకు వెళ్లేందుకు కారు కావలిస్తే నౌకరు కుర్రాడితో చెప్పి నాకు ఫోన్ చేయించు పద్మా'' అన్నాడు.

"అక్కర్లేదులే'' అంది పద్మావతమ్మ, ఎప్పుడూ లేని దర్జాతో నవ్వుతూ.

స్నానాలూ, భోజనాలూ కానిచ్చి కాసేపు రెస్టు తీసుకున్నాక తమతోపాటు విశ్వనాథ్ పిల్లల్ని కూడా వెంటబెట్టుకుని టాక్సీలో తిరుచానూరు, కపిలతీర్థం వెళ్లొచ్చిందామె. దారి పొడుగునా కూల్‌డ్రింకుల్తో, ఐస్‌క్రీముల్తో, పనసతొనల్తో వాళ్లను ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

ఆ రాత్రి వంటమనిషి వడ్డిస్తుండగా విశ్వనాథ్ కుటుంబంతో కలిసి భోంచేస్తున్నప్పుడు "ఇదిగో విశ్వం, మీరందరూ కూడా రేపు మాతో కొండకు రాకూడదూ? టాక్సీల్లో వెళదాం'' అంది.

"నాకు ఆఫీసులో పనుంది పద్మా. అదీకాక, ఇంతమంది దేనికీ? డబ్బు దండగ'' అన్నాడు విశ్వనాథ్.

"దండగేముంది? స్వామి డబ్బుంది కదా?''

అదేమిటో అర్థం కాక విశ్వనాథ్ మొదట తెల్లబోయాడు కానీ, ఆమె అసలు విషయం వివరించేసరికి పెద్దగా నవ్వడం ప్రారంభించాడు - "ఇదేమిటి, ఇంత సౌకర్యం గల మొక్కుబళ్ళున్నాయని నేనెప్పుడూ వినలేదే?'' అంటూ.

ఆ మాటలకు పద్మావతమ్మ ఉడుక్కుని, తమ గ్రామాల్లో ఆచారం అంతేనని చెప్పి, అందుకు ఉదాహరణగా కొత్తపాలెం కమలమ్మా, తుపాకుల పెద్ద నరసమ్మా, మోపూరి చిన్నక్కా, ఆచార్లుగారి ఆండాళమ్మా లాంటి ఉద్దండుల కేసుల్ని కోట్ చేసింది కానీ, అవేమీ ఖాతరు చెయ్యకుండా విశ్వనాథ్ నవ్వుతూ, "మొత్తానికీ మొక్కుబడి లాభకరంగానే ఉంది పద్మా! ఈ లెఖన నువ్వు రేపిక్కడ టౌన్లో బ్యూటీ పార్లర్‌కు వెళ్లి అక్కడ మసాజింగ్, స్టీమ్ బాత్, నెయిల్ పాలిషింగ్ లాంటివి చేయించుకుని అదంతా స్వామివారి పద్దుల్లో రాసేస్తే మాత్రం ఆయన కాదంటాడా? ఆ స్వామి కూడా అలంకారప్రియుడే కదా?" అన్నాడు.

దాంతో పద్మావతమ్మ మరింత క్షాత్రంగా, "నువ్వేమన్నా అనుకో బాబూ! మీరు వచ్చినా రాకున్నా ఈ దఫా మాత్రం మేం టాక్సీలోనే వెళ్లదల్చుకున్నాం" అంది.

భోజనాల తర్వాత టీ.వీలో ఏదో మంచి ఢిల్లీ ప్రోగ్రాం ఉందన్నారుకానీ, పద్మావతమ్మ వాళ్లు మర్నాడు పొద్దున్నే లేచి కొండకు బయల్దేరాలి కాబట్టి పెందరాళే పడుకోవాలని మేడ మీదికి వెళ్లారు.

అక్కడ హాల్లో వాళ్ల కోసం నౌకరు కుర్రాడు పరుపుల మీద ఇస్త్రీ షీట్లు సర్దుతుంటే, పిల్లలు సోఫాల్లో చేరగిలబడి కునికిపాట్లు పడసాగారు. ఈలోగా పుల్లమ్మ హాల్లోని ఫర్నిచర్నీ, అద్దాల్నీ, షోకేసుల్నీ ఒక్కొక్కటీ చూస్తూ అటూ ఇటూ తిరుగుతోంది.

పద్మావతమ్మ ఓ మూల పేముకుర్చీలో నీరసంగా కూచుంది. ఆమెకా హాల్లోని సామాన్లన్నీ పాతవే అయినా, ఈమారు అటు పక్క స్టాండు మీద ఏదో వస్తువు సిల్కు కవరు కప్పి ఉంచినట్లుంటే, ఏమిటా అనుకుంటూ వెళ్లి కవరు తీసి చూసింది. అదో చిన్న టీ.వీ.సెట్టు. ఆమె దాన్ని నలువేపులా ఆశ్చర్యంగా పరిశీలించడం గమనించి, ఈలోగా పరుపులు సర్దడం పూర్తి చేసిన నౌకరు కుర్రాడు అక్కడికి వచ్చాడు.

"పోయిన నెల అయ్యగారు జపాన్ వెళ్లినప్పుడు తెచ్చారమ్మగారూ. కొత్త మోడల్. పోర్టబుల్ అయినా, కలర్, రిమోట్ కంట్రోల్ అన్నీ ఉన్నాయి. రెండు సెట్లు తెచ్చి, ఒకటి వాళ్లక్కయ్యగారికిచ్చారు. ఇది రెండోది" అంటూ చెప్పుకొచ్చాడు వాడు.

"కింద హాల్లో ఉన్న కలర్ టీ.వీ. చాలనట్లు, ఇంకొకటెందుకో - మెహర్బానీ" అనుకుంది పద్మావతమ్మ. డబ్బెక్కువయ్యే కొద్దీ మనుషులకు పట్టపగ్గా లుండవేమో!

ఆమెకారాత్రి సరిగా నిద్రపట్టలేదు. దానికితోడు అశాంతితో తనకేం నిమిత్తం లేదన్నట్లుగా ఎదురుగా గోడ మీద పెద్ద పటంలో నీలం రంగు బల్బుకాంతుల కింద వెంకటేశ్వరస్వామి చిరునవ్వులొలికిస్తూ ఉండడం ఆమె కోపాన్ని ఎక్కువ చేసింది.

ఈ దేవుడికి మాత్రం పట్టపగ్గాలున్నాయా అని! హుండీలో డబ్బు చేరుతున్న కొద్దీ ఇద్దరు పెళ్లాలు కావాల్సి వచ్చె - తిరుచానూరులో ఆవిడా, ఈ ఊళ్లో బీబీ నాంచారమ్మాను. ఆయనకిద్దరు పెళ్ళాలున్నప్పుడు, ఆయన కొలువులో పని చేసే పెద్దమనుషులకు రెండు కలర్ టీ.వీలైనా లేకపోతే ఎలా అందగిస్తుంది పాపం?

అయినా, మనుషులు తాము ఒకప్పుడు ఎలా ఉండేవారో, ఎన్నిసార్లు అప్పుల కోసం పరుగెత్తేవారో అంత తొందరగా మరిచిపోతే ఎలా?

అడిగినప్పుడల్లా అప్పులివ్వడమే కాకుండా అప్పట్లో విశ్వనాథ్‌ను అల్లుణ్ణి కూడా చేసుకుందామని నాన్న ఉబలాటపడ్డాడంటే, ఏదో మేనల్లుణ్ణి తమలో కలుపుకుని ఆస్తినంతా అప్పగిద్దామనే తప్ప, వాళ్ళకేదో వేలాంతరాల ఆస్తులు కొల్లబోతున్నాయని కాదు. అయితే, సంతర్పణలు చేసే తండ్రి పక్కనే ఉంటే ఆ ఆస్తంతా కృష్ణార్పణం అవుతుందన్న భయం పిల్లనిచ్చే తండ్రికి ఉండడం, ఆ భయంతో ఇల్లరికం రమ్మనడం తప్పా? అమ్మో, అది తప్పే అయినట్టూ, తమకు ఆస్తులే అక్కర్లేనట్టూ, ఇల్లరికం వెళ్ళే వాళ్ళు మనుషులే కానట్టూ ఆ తండ్రీ కొడుకులు పెట్టిన పోజులు ఎన్నని! అందుకే ఇలాంటి అడుక్కు తినే మనుషుల్తో మనకు పొత్తు కుదరదు పొమ్మన్నాడు నాన్న.

నిజంగా అడుక్కుతింటూనే ఉండవలసింది - ఆ తరువాత అదేదో ఫారిన్ ఛాన్సూ, ఉద్యోగమూ వచ్చి ఉండకపోతే.


ఈ ఆలోచనల్తో పద్మావతమ్మ పొద్దున నాలుగుదాకా మేలుకుని ఉండడం వల్ల, ఇహ ఆ తరువాత నిద్రపోయేదేమిటని తనవాళ్లనందర్నీ లేపగొట్టింది.

అందరూ కాలకృత్యాలు తీర్చుకుని, ప్రయాణానికి తయారై మేడ దిగి వచ్చేసరికి, వంటమనిషి టిఫిన్ తయారుచేస్తోంది. కానీ, ఈసారి మాత్రం తాను ఇంటి టిఫిన్‌కు కనిపెట్టుకునే బాపతు కాదని సర్వులకూ తెలియ జేయదలచుకున్న పద్మావతమ్మ, టైమయిపోతోందని చెప్పి ఆటోరిక్షా తెప్పించింది. తమ వెంట విశ్వనాథ్ చిన్న కొడుకు ద్వారక్‌ను కూడా ఎలాగో నచ్చజెప్పి బయల్దేరదీసింది.

ఇహ అక్కణ్ణుంచీ వీరావేశం వచ్చినట్లుగా డబ్బు ఖర్చు పెట్టిందామె. ఆటోలో సరాసరి ఏ.సి. హోటల్‌కు వెళ్లాక అక్కడ అందరికీ టిఫిన్ బిల్లు ఎనభై రూపాయలు; తర్వాత కొండ మీదికి రానూపోనూ టాక్సీకి రెండొందలు; అక్కడ కాటేజీకీ, దర్శనానికీ, స్పెషల్ భోజనానికీ రెండొందల యాభై; పిల్లలకు గుండ్లు చేయించాక వాళ్లకూ, ద్వారక్‌కూ టోపీలకు అరవై; విశ్వనాథ్ ఇంట్లోనూ, ఊళ్లో తన పార్టీలోని అమ్మలక్కలకూ ఇచ్చేందుకై పాతిక లడ్డూలకు వంద; ఈ మొక్కుబడికంతా కారణభూతుడైన స్వామివారి హుండీలో పదీ; కొండ దిగి వచ్చాక పిల్లలకు కారుబొమ్మలకు డెబ్బై అయిదూ.


కానీ, ఇంత ఉదారంగా ఉన్నా తాను చివర్న విశ్వనాథ్ దగ్గర ఓడిపోక తప్పడం లేదేమో అనిపించిందామెకు. కారణం - ఆ సాయంత్రం ఆమె తను తెచ్చిన కొండ లడ్డూలు ఓ నాలుగు విశ్వనాథ్ భార్యకు ఇవ్వబోతుంటే, పక్కనే ఉన్న విశ్వనాథ్ అన్న మాటలు: "ఏం, పద్మా! ఇదీ స్వామి డబ్బు లోనిదేనా? అయినా, ఇవి ఊరికి తీసుకెళ్లి తెలిసినవాళ్ళకెవరికైనా ఇవ్వ వచ్చుగదా? ఇక్కడ మాకు రోజూ ఎవరో ఒకరు తెచ్చిస్తూనే ఉంటారు."

"ఆ తెచ్చిచ్చే వాళ్లలో నేనూ ఒకర్ననుకోరాదూ?" అని ఆమె నవ్వేస్తూ



ఆయన కొలువులో పనిచేసే పెద్దమనుషులకు రెండు కలర్ టీవీలైనా లేకపోతే ఎలా అందగిస్తుంది పాపం?

సేఫ్టీ పిన్ను తీసుకుని, దాని ములికితో టీవీ స్క్రీను మీద అటూ ఇటూ గీరింది.



లడ్డూలు అందించింది కానీ, లోపల కోపం రగిలింది. ఆ కోపంలో ఆమె వెయ్యిన్నూటపదహార్ల యాత్ర సాకుతో తిరుపతి దగ్గరున్న ఏర్పేడు, గుడిమల్లాం, చిత్తూరు దగ్గరున్న కాణిపాకం లాంటి చోట్లకు వెళ్లి రావాలనుకున్న మనిషల్లా ఆ ప్రోగ్రాంలన్నీ కేన్సిల్ చేసుకుని, తాము మర్నాడు పొద్దున్నే తిరుగు ప్రయాణమని చెప్పేసింది.

ఇంకొక్క రోజైనా ఉండి బడలిక తీర్చుకుని వెళ్లమని విశ్వనాథ్, అతడి భార్య చెప్పినా ఆమె వినిపించుకోలేదు.

ఆ రాత్రి కూడా ప్రయాణపు బడలిక సైతం పద్మావతమ్మకు కంటిమీదికి నిద్ర తెప్పించలేకపోయింది.

ఇలాంటప్పుడే ఆమెకు చికాకు ఎక్కువవుతుంటుంది - ఈ ఊళ్లో వెలిసి ఉండడం ద్వారా తన ఓర్పును పరీక్షిస్తున్న వెంకటేశ్వరుడి మీద. మరి ఆయన వేరే ఊళ్లో ఉంటే, అక్కడ విశ్వనాథ్ లాంటి చుట్టాల ఇల్లు లేదు కాబట్టి, ప్రతిసారీ యాత్రకు వెళ్లినప్పుడక్కడ హోటళ్లలో బస చేస్తుందా అంటే - ఏం, ఎందుకు చెయ్యదు?

ఈ దేవుడికి మంచి బుద్ధి పుట్టి తమ పొలాల్లో ఆదాయం ఒకటికి నాలుగింతలు కావాలే తప్ప - అప్పుడు హోటళ్లలో బస చెయ్యడమే కాదు, ధర్మసత్రాలు కూడా కట్టించేంత మనిషి తాను.

రాత్రి ఒంటిగంటవుతోంది. పక్కనే పరుపుల మీద పిల్లలూ, పుల్లమ్మా ఒళ్లు తెలీకుండా నిద్రపోతున్నారు.

అంతటా నిశ్శబ్దం.

మూలనున్న కొత్త టీ.వీ. మీది కవరు ఎవరో తొలగించినట్లున్నారు. టీ.వీ. స్క్రీను పాలు కారుతున్నంత తెల్లగా, నునుపుగా, స్ఫటికంలా మెరుస్తోంది. చుట్టూ ఉన్న లైనింగ్ బంగారు గొలుసులా సొగసులు చిమ్ముతూ కవ్విస్తోంది.

పద్మావతమ్మ కోపంగా లేచింది. అడుగులు చప్పుడు కాకుండా మెల్లగా టీ.వీ. దగ్గరికి వెళ్లి, దాని అడుగు భాగంలో ఉన్న స్విచ్‌నీ, బటన్‌నూ పట్టి గట్టిగా, బలంగా గుంజింది.

ఆ గుంజడంలోని తాకిడికి లోపల ఏదో వదులైనట్లు టప్ మన్న శబ్దం వినిపించాక, ఆమె తన మెళ్లోని తాళిబొట్టు దారానికి వేళ్లాడే సేఫ్టీ పిన్నొకటి చేతిలోకి తీసుకుని, దాని ములికితో టీ.వీ. స్క్రీను మీద అటూ ఇటూ గీరింది. తను చేస్తున్నది ఎవరూ గమనించలేదని నిర్ధారణ చేసుకున్నాక, వెళ్లి నిమ్మళంగా తన పరుపుపై పడుకుంది.

తర్వాత ఆమెకు ఎంత హాయిగా నిద్ర పట్టిందంటే, పొద్దున ప్రయాణానికి టైమవుతోందంటూ పుల్లమ్మ లేపేవరకూ మెలకువ రాలేదు.

మరో గంటకల్లా నౌకరు కుర్రాడు వాళ్ల సామాన్లన్నీ ఆటో రిక్షాలో సర్దుతున్నాడు. వంటమనిషి వాళ్లందరికీ ట్రేలో కాఫీలు తెచ్చి అందిస్తోంటే, విశ్వనాథ్ భార్య వాళ్లందరినీ ఈమారు బ్రహ్మోత్సవాలకు తప్పకుండా రమ్మని చెబుతోంది.

ఇంతలో అక్కడికి వచ్చిన విశ్వనాథ్ నౌకరు కుర్రాణ్ణి కేకేసి పిలిచి, "మేడమీంచి కొత్త టీ.వీ. తీసుకురా" అన్నాడు.

పద్మావతమ్మకు గుండె ఆగినంతపనైంది.

"ఆమధ్య జపాన్ నుంచి రెండు టీ.వీ.లు తెచ్చాను పద్మా. ఒకటి మా అక్కయ్యకూ, రెండోది నీకూ. మొన్న నువ్వు వచ్చినప్పట్నుంచీ చెబుదామనుకుంటుంటే, నువ్వు నీ యాత్రతో హైరానా పడుతుంటివి" అన్నాడు విశ్వనాథ్.

నౌకరు కుర్రాడు మేడమీది నుంచి టీ.వీ. తెచ్చి అట్టపెట్టెలో బిగించి, ఆటో రిక్షాలో ఓ మూల సర్దించాడు.

దాని స్విచ్, బటన్ వదులైపోయి ఉండడమూ, స్క్రీను గీరుకుపోయి ఉండడమూ ఎవరూ గమనించినట్లు లేదు.

"దాన్ని బస్సులో జాగ్రత్తగా తీసుకెళ్లండి. చాలా సున్నితమైన టీ.వీ. ఏ పార్టు పాడైనా-చివరకు స్విచ్‌లూ, బటన్సూ కూడా-మళ్లీ వేయించాలంటే ఒక్కొక్కటి వెయ్యి రూపాయలకు పైనే అవుతుంది" అన్నాడు విశ్వనాథ్.

"ఇప్పుడివన్నీ ఎందుకు విశ్వం?" అని బలహీనంగా నవ్వింది పద్మావతమ్మ.

అందరికీ వీడ్కోలు చెప్పి, పిల్లలతో, పుల్లమ్మతో కలిసి ఆటోలో ఎక్కి కూచున్నాక, డ్రైవరుతో నేరుగా బస్టాండుకు తీసుకుపొమ్మని చెప్పిందామె. పుల్లమ్మ నిరుత్సాహపడింది.

అనుకోకుండా అందమైన టీ.వీ. బహుమతిగా వచ్చిందుకు యజమానురాలు తమందరినీ దారిలో హోటలుకు తీసుకెళ్ళి మరింత ఉత్సాహంగా ఖర్చు పెడుతుందనుకుందామె.

బస్టాండుకు చేరగానే ఆ సమయానికి బయల్దేరుతూ కనిపించిన డొక్కు బస్సులో సామాన్లనూ, పరివారాన్నీ చేరవేసి తానూ ఒక మూల సీట్లో కూలబడింది పద్మావతమ్మ.

బస్సు బస్టాండు దాటి, విష్ణుప్రియా హోటలు దాటి, వేగం పుంజుకుని ఓవర్ బ్రిడ్జి మీది కెక్కుతోంటే, ఆమెకు అధఃపాతాళానికి జారిపోతున్నట్లుగా ఉంది.

ఎదురింటి తులశమ్మను మొహం మీద ఛీకొట్టినట్లుగా తన ఇంటికి ధగధగలాడుతూ చేరవలసిన కొత్త టీ.వీ. ఇలా తయారైంది.....అయినా, తన తప్పేముంది? విశ్వనాథ్ ముందుగా చెప్పకపోయె. ఇన్నాళ్లూ తన మొక్కుబళ్లన్నీ అపురాపురని అందుకుంటున్న ఆ వెంకన్న అయినా కల్లో కనబడి చెపితేనేం? విశ్వాసం లేని దేవుడు!

బస్సు వేగానికి బయటి నుంచి వచ్చి మొహానికి తగిలే చల్లగాలి స్పర్శను ఏమాత్రం అనుభవించలేకుండా ఉన్న మనస్సులో, తటాలున ఓ వింత భావన తళుక్కుమంది.

విశ్వనాథ్ చెప్పినదాన్ని బట్టి కొత్త టీ.వీ.కి బటన్ కానీ, స్విచ్ కానీ కొత్తవి వేయించాలంటే అయ్యే ఖర్చు వెయ్యి రూపాయల పైచిలుకు - అంటే మొదట్లో తను స్వామికి సమర్పిస్తానని మొక్కుకున్న మొత్తం. ●